

రైతుభరోసాపై ఉమ్మడి జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు, తదితరులు

పకడ్బందీగా.. పారదర్శకంగా..

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- అర్హులైన అన్నదాతలందరికీ రైతు భరోసా
- అందుకే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ
- వారు చెప్పిందే అమలవుతుంది.. జీవోగా వెలువడుతుంది
- గత ప్రభుత్వంలో రైతుబంధు దుర్వినియోగం
- రైతు భరోసా సదస్సులో డిప్యూటీ సీఎం, మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ భట్టి విక్రమార్క
- హనుమకొండ కలెక్టరేట్‌లో రైతు భరోసాపై సదస్సు
- హాజరైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు
- పలువురు ఉమ్మడి జిల్లా రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ
- రెండున్నర గంటల పాటు సాగిన సమావేశం

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకాన్ని పారదర్శకంగా.. పకడ్బందీగా అమలు చేసి అర్హులైన రైతులందరికీ భరోసాను అందిస్తామని, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్టు కాకుండా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి, రైతు భరోసా మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం నిర్వహిస్తున్న ఉమ్మడిజిల్లాల స్థాయి విస్తృత సమావేశాల్లో భాగంగా సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సుమారు 250


సమావేశానికి హాజరైన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు, సంఘాల ప్రతినిధులు

మంది రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. తొలుత ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల నుంచి వచ్చిన రైతులు, రైతు సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి నిర్ణీత ఫారమ్‌లో పేర్లు, వివరాలు తీసుకున్నారు. వారిలో నుంచి ర్యాండమ్‌గా ఎంపిక చేసిన వారి నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఒక గుంట భూమి కలిగిన రైతు నుంచి 10ఎకరాల వరకు ఉన్న రైతులందరికీ రైతుభరోసా అమలు చేయాలని, కౌలు రైతులకు కూడా పథకాన్ని వర్తింపజేయాలని మెజారిటీ రైతులు తమ అభిప్రాయాలు వినిపించారు. వారి అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు భరోసా అమలుపై క్షేత్ర స్థాయిలో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్న ఉపసంఘం రైతులు చెప్పిన అభిప్రాయాలన్నిటినీ క్రోడీకరించి అసెంబ్లీలో ప్రవేశపెడుతుందని, అక్కడ కూలంకశంగా చర్చించిన తర్వాత అమలు చేస్తుందన్నారు. అభిప్రాయసేకరణ సందర్భంగా రైతులు ఏం చెప్పారో అదే అమలవుతుందని, అదే జీవోగా వస్తుందన్నారు. రైతు భరోసా అమలు విషయంలో ఎలాంటి అంక్షలు ఉండవని, ఈ విషయంలో ప్రభుత్వం

మిగతా 7వ పేజీలో..



అర్హులెందరో?

రైతు రుణమాఫీకి ప్రభుత్వ మార్గదర్శకాల జారీతో మొదలైన చర్చ

- అమలుకు రేషన్‌కార్డు ప్రామాణికంపై రైతుల్లో ఆందోళన
- ప్రతీ కుటుంబానికి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షలు మాఫీ
- ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు చెల్లించేలా సర్కారు ప్రణాళిక
- సహకార సంఘాలు, ప్రభుత్వ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు వర్తింపు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90లక్షల మందికి పైగా రైతులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు రుణమాఫీపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పంద్రాగస్టులోపు ఒక రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేసే కసరత్తును సర్కారు మరింత వేగిరం చేసింది. దీంతో సహకార సంఘాలు, జాతీయ బ్యాంకుల్లో 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు పంట రుణాలు తీసుకున్న రైతుల్లో ప్రతీ కుటుంబానికి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల రుణం మాఫీ కానుంది. దీనిపై సోమవారం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కావడంతో అధికారులు అర్హులను గుర్తించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా.. రుణమాఫీకి రైషన్‌కార్డును ప్రామాణికంగా పెట్టడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు ఈ మాఫీ పథకానికి ఎవరెవరు అర్హులవుతారు? ఎంతమంది అర్హులుగా గుర్తించబడతారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 8.90లక్షల మంది రైతులు ఉండగా, ప్రభుత్వ విధివిధానాల మేరకు ఎంతమందికి రుణమాఫీ వర్తిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

ప్రభుత్వ మార్గదర్శకాల్లో కీలకమైనవి ఇవే..

ఎన్నికల హామీని నెరవేర్చడమే లక్ష్యంగా కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పంద్రాగస్టులోపు పక్కాగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలనే పట్టుదలతో

మిగతా 7వ పేజీలో..

మొక్కలు నాటి పరిరక్షించాలి

మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


మహబూబాబాద్ సిగ్నల్ కాలనీలో మొక్కలను పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 15: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని 26వ వార్డు పరిధి సిగ్నల్‌కాలనీలో వనమహోత్సవంలో భాగంగా సోమవారం ఇంటింటికి పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... చెట్లు నరకడం వల్ల అడవులు అంతరించిపోయి పర్యావరణం దెబ్బతింటోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, వార్డు కౌన్సిలర్ డొలాగర్ స్వాతి శంకర్, హెల్త్ అసిస్టెంట్ లత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.

శ్రీవాసవి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో టై, బెల్ట్‌ల పంపిణీ

మహబూబాబాద్ పట్టణంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో శ్రీవాసవి సేవా ట్రస్టు, దాత గర్రెపెల్లి వెంకటేశ్వర్లు(జీవీఎల్) ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్ట్‌లను పంపిణీ చేశారు. 150 మంది విద్యార్థులకు రూ.10,500 విలువ గల టై, బెల్ట్‌లను ఉచితంగా అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండి ఇతరులకు తోచిన సాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తల్లాడ విజయ్‌కుమార్, చిదిరాల శరత్, వాసవి సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి గోపు రాము, హరీష్, పాఠశాల హెచ్‌ఎం సోమయ్య పాల్గొన్నారు.

బయ్యారంలో అలుగు పారుతున్న కాకతీయుల నాటి పెద్ద చెరువు



విస్తారంగా వాన

- ఉమ్మడి జిల్లాలో పలు చెరువులకు జలకళ
- పలుచోట్ల ఉప్పొంగిన వాగులు

7లో..

రైతుల రుణాలు మాఫీ చేస్తాం

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య


గార్ల పెద్దచెరువు పంట కాలువల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, జూలై 15 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగమైన రైతు రుణమాఫీని కచ్చితంగా అమలు చేసి తీరుతామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం గార్ల పెద్ద చెరువు పంట కాలువల పనులను ఆయన సొంత ఖర్చులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిధుల కొరత మూలంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో కొంత జాప్యం జరుగుతుందని తెలిపారు. దీన్ని అధిగమించడం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పక్కదారి పట్టించే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని, దీన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు.

కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ వంశీ, పీఏసీఎస్ చైర్మన్ వడ్లముడి దుర్గాప్రసాద్, మాజీ జడ్పీటీసీ జాటోతు ఝాన్సీ లక్ష్మి, మాజీ ఎంపీపీ భట్టు నాగరాజు, కట్ట శ్రీనివాసరావు, పరుచూరి వెంకటేశ్వర్లు, సూరపురెడ్డి వెంకట్‌రెడ్డి, గుండా వెంకట్‌రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసు ఎదుట అంగన్‌వాడీల ధర్నా

మహబూబాబాద్ టౌన్, జూలై 15 : అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మానుకోటలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి స్నేహబిందు మాట్లాడుతూ... అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్షకు పెంచడంతో పాటు వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. అంగన్‌వాడీలు గత 49 ఏళ్లుగా సేవలందిస్తున్నారని, వారిని ఉట్టి చేతులతో ఇంటికి పంపించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, లేనిపక్షంలో ఈనెల 19న హైదరాబాద్‌లోని శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కుమ్మరికుంట్ల నాగన్న, వాసం దుర్గారావు, తిరుపతమ్మ, మంగమ్మ, మల్లికాంబ, ఆండాలు, సలీమా, వీరలక్ష్మి, మంగ, ధనలక్ష్మి, సరస్వతి, మంజుల పాల్గొన్నారు.

- తొర్రూరు : అంగన్‌వాడీలకు నష్టం చేసే జీవో 10 రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తొర్రూరులోని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ


మహబూబాబాద్‌లో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు

ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కార్యాలయ వ్యక్తిగత సహాయకురాలు శ్రీలతకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జె.శ్రీనివాస్, సాంబయ్య, యాకూబ్, అంగన్‌వాడీలు సుకన్య, మంజుల, యాకలక్ష్మి, ఝాన్సీ, సరళ, సైదాబి, సురేఖ, అరుణ, వెంకటలక్ష్మి, లలిత, సంధ్య, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

- మరిపెడ : అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మరిపెడ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు రిటైర్మెంట్ ప్రకటించిందని, ఈ ప్రభుత్వం జీవో 10 తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 19న రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ధర్నాలో సరోజ, లలిత, జ్యోతి, ఉమారాణి, విజయ, ఉమ, పద్మ, కవిత, సీఐటీయూ నాయకులు దుండి వీరన్న, వెంకన్న, ఉప్పలయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో


కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 125 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 58, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)కు 13, విద్యుత్ శాఖకు 01, పోలీసు శాఖకు 02, ఇలా వివిధ విభాగాలకు సంబంధించి మొత్తంగా 125 దరఖాస్తులు వచ్చాయి. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్. జడ్పీ సీఈవో నర్మద, సీపీవో సుబ్బారావు, డీఈవో రామారావు, డీడబ్ల్యూవో వరలక్ష్మి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

- చేపపిల్లలకు బదులు మత్స్యబంధు అమలు చేయాలి
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

కేసముద్రం, జూలై 15 : ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, కోఆపరేటివ్ సొసైటీకి రూ.1000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో సోమవారం మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలని కోరారు. మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు మత్స్యబంధు పథకం ద్వారా నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు ఆసరా పింఛను ఇవ్వాలని, ముదిరాజ్‌ల కోసం ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేయాలని, రాజకీయ రంగంలో ప్రాధాన్యతనిస్తూ మండలిలో మూడు స్థానాలు, రాజ్యసభలో ఒక స్థానం, కార్పొరేషన్లలో 10 శాతం స్థానాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగాల పిచ్చయ్య, కొత్తూరు రమేష్, సూరయ్య, వెంకన్న, జీజుల వీరభద్రం, దుండి మధుకర్, విజేందర్, సంపత్, కొండబోయిన అశోక్, మల్లేషం, మాలి సుధాకర్, సారయ్య, పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న గొడుగు శ్రీనివాస్

బీఈడీ, డైట్ ప్రిన్సిపాల్‌గా వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 15 : హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలను డి. వాసంతికి అప్పగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి. అబ్దుల్ హై అనారోగ్య కారణాల రీత్యా రెండు నెలల పాటు సెలవులో వెళ్లగా, డైట్ ప్రిన్సిపాల్ కె. నారాయణరెడ్డి సెలవులో వెళ్లారు. దీంతో వాసంతికి రెండు కళాశాలల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ఇప్పటికే ఆమె వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

బాలుడి మృతిపై విచారణకు ఆదేశం

వరంగల్ మెడికల్, జూలై 15 : కుక్క కాటుకు ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి ఓ పదేళ్ల బాలుడు మృతి చెందడంతో విచారణకు ఆదేశించారు. వరంగల్ జిల్లా ముదిగొండ గ్రామానికి చెందిన బాలుడు మణిదీప్(10)కు కుక్క కరవడంతో స్థానికంగా ఉండే ఆర్ఎంపీ అశోక్ దగ్గరకు తీసుకెళ్లగా ఇంజక్షన్ వేశారు. వెంటనే బాలుడు కుప్పకూలడంతో హుటాహుటినా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన ఎంజీఎం వైద్యులు బాలుడు మృతి చెందినట్లు ధృవీకరించారు. వైద్యుడు, ఆర్ఎంపీ అశోక్ యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇంజక్షన్ వేయడంతో వికటించి మణిదీప్ మృతి చెందాడు. దీంతో వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) వెంటనే స్పందించి సుమోటోగా స్వీకరించింది. వరంగల్ జిల్లా యాంటీ క్వాకరీ బృందానికి సంఘటనపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ టీజీఎంసీ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్ కుమార్, రాష్ట్ర ఐఎంఏ వైస్ ప్రసిడెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, వరంగల్ ఐఎంఏ ప్రసిడెంట్ డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ హెచ్ఆర్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రాకేశ్ నేతృత్వంలోని వైద్య బృందం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి త్వరలో విచారణ చేయనుంది.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల జీవో జారీ

బాలసముద్రం, జూలై 15: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖలో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శాఖ కమిషనర్ బుద్ద ప్రకాష్ సోమవారం జీవో జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్, క్యాషియర్, టైపిస్టు, అటెండర్లకు మాత్రమే బదిలీలకు షెడ్యూల్ విడుదల చేశారు. ఒకే స్థానంలో రెండు సంవత్సరాలు సర్వీసు కలిగిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. నాలుగు సంవత్సరాల సర్వీసు ఒకే స్థానంలో పూర్తి చేసుకున్నవారికి తప్పనిసరిగా స్థానచలనం ఉంటుంది. కాగా, మంగళవారం లోగా ఉద్యోగులు జాబితా పంపించాలని జీవోలో పేర్కొన్నారు. 20వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నారు. మిగతా క్యాడర్ల బదిలీల జీవో ఒకటి, రెండు రోజుల్లో జారీ అయ్యే అవకాశం ఉంది.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గొడవ

ఓ భూమి విషయంలో హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం గొడవ జరిగినట్లు సమాచారం. నగరంలోని సుబేదారి ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు ఆలయ నిర్మాణం కోసం ప్రైవేట్ వ్యక్తి వద్ద 300 గజాల స్థలం కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుని కొంత డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. మిగతా డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. అగ్రిమెంట్ చేసుకున్నవారు రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలో జాప్యం చేయడంతో పట్టాదారు వేరే వారికి ఆ స్థలం విక్రయించినట్లు సమాచారం. సోమవారం రిజిస్ట్రేషన్ ఉందని సమాచారం ఇచ్చినట్లు సమాచారం తెలుసుకొని మొదట అగ్రిమెంట్ చేసుకున్నవారు కార్యాలయానికి వచ్చి పట్టాదారులు, అధికారులతో గొడవకు దిగినట్లు తెలిసింది. వారించినా వినకపోవడంతో అధికారులు కాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సమాచారం. పోలీసులు కార్యాలయానికి వచ్చి గొడవచేసిన వారిని పంపించినట్లు తెలిసింది. గొడవ చేసినవారిపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కాజీపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొడవ చేస్తున్నప్పుడు తీసిన వీడియో రికార్డింగ్‌లను పోలీసులకు ఇచ్చినట్లు శాఖ అధికారులు తెలిపారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో జేఆర్ఎఫ్ సాధించిన రవిస్వామి

కేయూ క్యాంపస్, జూలై 15: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జాతీయ స్థాయి జేఆర్ఎఫ్, నెట్ సాధించి అత్యున్నత ప్రతిభ చూపిన నామాల రవిస్వామికి వర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించింది. ఈ మేరకు సోమవారం కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ పెదమల్ల శ్రీనివాసరావులు యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ విభాగంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ పత్రాన్ని అందచేసి అభినందించారు. నామాల రవిస్వామి 'ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్ట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీ (పీడబ్ల్యూడీ)స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్- ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ యూనివర్సిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ' అనే అంశంపై ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో పరిశోధన చేయనున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన రవిస్వామి చిన్ననాటి నుంచి చూపు సమస్యను ఎదుర్కొని పట్టుదలతో జాతీయ స్థాయి నెట్, జేఆర్ఎఫ్ సాధించడం పట్ల వర్సిటీ ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చాలి

రెడ్డికాలనీ, జూలై 15: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కో ఆర్డినేషన్ కన్వీనర్ గోధుమల కుమారస్వామి అన్నారు. సోమవారం ములుగురోడ్‌లోని ముస్లిం మైనార్టీ ఫంక్షన్‌హాలులో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన తొలితరం ఉద్యమకారుడు డాక్టర్ అనీక్ సిద్ధికి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ రంగాల కార్మికులు, మేధావులు, సబ్బండ వర్గాలు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉద్యమాన్ని నిర్మించాయన్నారు. ఆత్మ బలిదానాలతో ఆనాటి ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొని ప్రత్యేక రాష్ట్రం సాధించడం జరిగిందన్నారు. ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక గ్రేటర్ వరంగల్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాజీ కార్పొరేటర్ మహ్మద్ నయీం, అధ్యక్షులుగా డాక్టర్ కేడల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మీర్జా అంజాద్, గోపనబోయిన రాజు, దుర్గాదాస్, నవరత్న ఆనంద్, నాగపురి శ్రీనివాస్, ధర్మపురి రామారావు, తెలంగాణ కొమురయ్య, ఐతం నగేష్, చెరుకు ప్రవీణ్ కుమార్, ప్రకాశ్, సుధాకర్, పోలేపాక సతీష్ ఎన్నికయ్యారు.

గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా


గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం రూరల్, జూలై 15: గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి మెరుగైన సేవలందించేందుకు సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీ వో చిత్రమిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌ను నిర్వహించారు. గిరిజ నుల నుంచి పీవో వినతులు స్వీకరించారు. మొత్తం 42మంది గిరిజనులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్‌లో తనకు సీటు వచ్చిందని, చదువు కోసం ఆర్థికసాయం అందించాలని ములుగు మండలం అన్నంపల్లి గ్రామానికి చెందిన పోరిక రాహుల్ వినతిపత్రం అందజేశారు. మహాదేవపూర్ మాడ పరిధిలో అత్యధికంగా నివాసం ఉంటున్న గిరిజనులకు ఇసుక సొసైటీ ఏర్పాటుచేసి తవ్వకాలకు అనుమ తులు ఇవ్వాలని పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన సుధాకర్ విన్నవించారు.

గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పిం చాలని ఏటూరునాగారం మండలం గుర్రాలబావికి చెందిన గొత్తికోయ వాసులు సోలం దేవయ్య వినతిపత్రం అందించారు. మంగపూ మండలం మల్లూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధర్మకర్తలుగా గిరిజ నులనే నియమించాలని ఆ గ్రామానికి చెందిన యాలం రాజశేఖర్ కోరారు. కాకతీయ మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో వైటీసీ ఏటూ రునాగారంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన శిక్షణ కాలంలో భోజ నాలు అందించామని, వాటికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలని సంఘం సభ్యులు కోరారు. జీఎన్ఎం కోర్సు పూర్తి చేశానని, ఏదైనా వైద్యశాలలో ఏఎన్ ఎంగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పించాలని వాజేడు మండలం కొంగాల గ్రామానికి చెందిన తాటి దేవిక, గడ్డం రాధిక విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదరస్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా.. పారదర్శకంగా..



5వ పేజీ తరువాయి

పూర్తిగా ఓపెన్‌మైండ్‌తో ఉందన్నారు. కౌలు రైతులకు కూడా పూర్తి న్యాయం చేస్తామని, అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలైన మహిళలకు ఉచిత బస్సు రవాణా, రూ.500కే గ్యాస్‌సిలిండర్, జీరో కరెంట్ బిల్లు అమలవుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం కూడా మొదలవుతోందన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక దఫా పంట సాయం చెల్లించామని, ప్రస్తుతం రైతు భరోసా అమలుకు కసరత్తు జరుగుతోందని, తమది ప్రజాప్రభుత్వమని, ప్రజల సొమ్ము.. ప్రతీ పైసా వారికే చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు మళ్లీ జరగకుండా తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట : మంత్రి తుమ్మల



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందని, సోనియా, రాహుల్ గాంధీల సూచనల మేరకు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తాము అధి కారంలోకి వచ్చాక రైతుల ఖాతాల్లో రూ.7662 కోట్లను పెట్టుబడిసాయంగా జమ చేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే వరంగల్‌లో రైతు డిక్లరేషన్ జరిగిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన.. ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్న ప్రతీ అంశం అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వంలో రైతు బంధు అమలులో జరిగిన అవకతవకలను ప్రభుత్వం సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. సదస్సులో పాల్గొన్న రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల నుంచి సూచనలు సలహాలను అడిగిన తుమ్మల.. గత ప్రభుత్వం పంటలు నష్ట పోయిన రైతులకు పరిహారంగా ఒక్క పైసా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు రూ.10వేల చొప్పు పరిహారం అందచేసిందన్నారు. ఇక నుంచి నష్ట పోయిన పంటలన్నిటికీ బీమా వర్తింపజేస్తామని, రైతులకు పెట్టుబడి సాయంతో పాటు ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల కొరత లేకుండా చూస్తామని చెప్పారు.

గత అవకతవకలను సరిదిద్దేందుకే సదస్సులు : మంత్రి సీతక్క



గత ప్రభుత్వం పంటలకు పెట్టుబడి కాకుండా పట్టాకు పెట్టుబడి ఇచ్చిందని, కొన్ని చోట్ల ఒక్కరికే రెండేసి సార్లు రైతు బంధు ఇచ్చారని, గతంలో జరిగిన అవకతవకలను సరిదిద్దడానికే రైతులతో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. నిజమైన రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగదని, క్షేత్రస్థాయిలో అర్హులైనవారిని గుర్తించి వారందరికీ రైతు భరోసా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అప్పులను సాకుగా చూపబోం : మంత్రి పొంగులేటి



పేదోడి రాజ్యం రావాలని, మంచి ప్రభుత్వం కావాలని ప్రజలు కోరుకున్నారని, గత ప్రభుత్వం ఎడాపెడా చేసిన రూ. 7లక్షల కోట్ల అప్పులను సాకుగా చూపి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వెనుకాడబోమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, గత ప్రభుత్వం విస్మరించిన ప్రాధమ్యాలు, సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని భరోసా ఇచ్చారు. గత సర్కారులా నాలుగు గోడల మధ్య కూర్చుని నిర్ణయాలు తీసుకోకుండా ప్రజలకు ఏం కావాలో.. ఏం చేయాలో క్షేత్రస్థాయికి వెళ్లి తెసుకోవడం ద్వారానే తగిన నిర్ణయాలను తీసుకొని అమలు చేస్తుందన్నారు. రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణకు నిర్వహించిన సమావేశంల్లో ఇది నాలుగోదని, పది ఉమ్మడి జిల్లాల్లో సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ పబ్బంగడుపుకోవడానికి నిరుద్యోగులను రెచ్చగొడుదున్నారని, ఇప్పుడు తప్పుడు అభిప్రాయాలను కల్పించడం ద్వారా రైతులను కూడా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాన్‌కార్డు కలిగి ఉన్న, ఆదాయం పన్ను చెల్లించిన రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్నది దుష్ప్రచారమేనని, రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాడు రైతు బంధు కింద పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని, అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు వర్క్‌షాపులను నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ అనవసర చర్చను లేవనెత్తుతూ వక్రమార్గం పట్టించేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు.

రైతుభరోసాపై సీఎం చిత్తశుద్ధితో ఉన్నారు : మంత్రి సురేఖ



రైతు భరోసా అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని, అర్హులైన రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గత రైతుబంధు విషయంలో కటాఫ్ పెట్టాలని తాను చెప్పినా గత ప్రభుత్వం వినకపోగా వందల ఎకరాల భూములున్న వారికి కూడా రైతుబంధు వర్తింపజేయడంతో ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. ఇందిరాగాంధీ నిరుపేదలకు అందించిన భూములు ధరణి రాకతో గల్లంతయ్యాని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె.. అర్హులైన రైతులకు రైతు భరోసా ఇచ్చేందుకే ఈ అభిప్రాయసేకరణ జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం సాగులోలేని వందల ఎకరాల భూమికి కూడా రైతు బంధు కింద రూ.లక్షలు ఇచ్చిందని, బడాభూస్వాములు, ఎన్ఆర్ఐలు కూడా రైతుబంధు తీసుకున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పంట నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం అందగా బీఆర్ఎస్ సర్కార్ పాలనలో ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణాయాల వల్ల రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు అనేక ఇక్కట్లు పడ్డారాన్నరు. రైతు సంతోషంగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పశువులు కూడా రైతులకు సంపదతో సమానమని, వాటికి కూడా బీమా వర్తింపజేయాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ తన అభిప్రాయాన్ని తెలిపారు.



ఈ సదస్సులో మహబూబాబాద్, వరంగల్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్ నాగరాజు, యశశ్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, మురళీనాయక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు, ఆరుజిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, రిజ్వాన్ బాషాషేక్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

'రైతుభరోసా'పై అన్నదాతల అభిప్రాయాలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 15 : రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణలో భాగంగా సోమవారం మంత్రివర్గ ఉప సంఘం హనుమకొండ కలెక్టరేట్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై రైతుల అభిప్రాయా లు సేకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 250 మంది తమ అభిప్రాయాలు వెల్లడించారు. వారిలో కొందరివి..

పదెకరాల వరకున్న రైతులకు రైతుభరోసా ఇవ్వాలి

మచ్చ సందీప్ కుమార్, బచ్చన్నపేట, జనగామ జిల్లా



ప్రభుత్వం రైతు భరోసాను పదెకరాల వరకు భూములున్న రైతులకు ఇవ్వాలి. కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తే వారి బాధలు కూడా తీరుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్‌కు ఎలాంటి ఆటంకం ఉండటం లేదు. యువ రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాగు చేసే వారికి ఇవ్వాలి

రమాదేవి, హసన్‌పర్తి, హనుమకొండ జిల్లా



కష్టపడి సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. అది కూడా ఐదెకరాల్లోపు భూమి ఉన్న వారికి ఇవ్వడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం కాదు. బంగారం, వజ్రాలు ఉన్న కోటీశ్వరులైనా మా లాంటి రైతులు పంట పండిస్తేనే తిండి తినగలుగుతారు. చిన్న సన్నకారు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం ఉంది. కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తే బాగుంటుంది.

ఐదెకరాల వరకు సాయం ఇవ్వాలి

తోటకూర నర్సయ్య, ఖిలా వరంగల్



ఐదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. భూ స్వాములకు ఇస్తే ప్రభుత్వం అప్పుల పాలవుతుంది. ఒక గుంట నుంచి 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు ఇస్తే పేద రైతులకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులే నేరుగా రైతులతో సమావేశం నిర్వహించి పథకం అమలుపై అభిప్రాయాలు సేకరించడం బాగుంది.

రైతు భరోసా కంటే ప్రతీ పంటకు బోనస్ ఇవ్వాలి

కూర వెంకటరాజిరెడ్డి, టేకుమట్ల, భూపాలపల్లి జిల్లా



రైతు భరోసా పథకం ఇవ్వడం కంటే రైతులు పండించే ప్రతీ పంటకు బోనస్ ఇస్తే బాగుంటుంది. బోనస్ ఇస్తే యువకులు కూడా వ్యవసాయంవైపు ఆసక్తి చూపుతారు. యువతను ప్రోత్సహిస్తే రాబోయే తరాలకు కూడా వ్యవసాయం అంటే తెలుస్తుంది. లేదంటే యువత సాగురంగానికి దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇక రైతు భరోసా ఇవ్వాల్సి వస్తే పదెకరాలలోపు ఉన్న రైతులకే ఇవ్వాలి.

గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు

ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ హయాంలో 8వేల మంది రైతులు చనిపోతే ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా చూడటానికి రాలేదు. బిచ్చం వేసినట్టు రైతుబంధు ఇచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి. రైతుల సమస్యల పరిష్కారానికి రైతు కమిషన్ ఏర్పాటు చేయాలి. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా ప్రధాన రహదారుల నుంచి మంచి రోడ్లు వేయించేలా నిర్ణయాలు తీసుకోవాలి.

నాడు ప్రత్యర్థులు.. నేడు మిత్రులు



పక్కపక్కనే కూర్చున్న రేవూరి, దొంతి

హనుమకొండ కలెక్టరేట్, జూలై 15 : రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉప సంఘం ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో పలు ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. నర్సంపేట నియోజకవర్గంలో దశాబ్దకాలం పాటు రాజకీయ ప్రత్యర్థులుగా టీడీపీ నుంచి రేవూరి ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి దొంతి మాధవరెడ్డి హోరాహోరీగా పోటీ పడ్డారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రేవూరి టీడీపీ నుంచి బీజేపీలోకి అక్కడి నుంచి కాంగ్రెస్‌లో చేరి గత ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక దొంతి మాధవరెడ్డి నర్సంపేట నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే వీరిద్దరు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన రైతుభరోసా సమావేశంలో పక్కపక్కనే కూర్చోవడం ఆసక్తిగా మారింది.

పక్కపక్కన డీసీసీబీ మాజీ, ప్రస్తుత చైర్మన్లు..



జంగా, మార్నేని

గతంలో చాలా సంవత్సరాలు డీసీసీబీ బ్యాంకు చైర్మన్‌గా జంగా రాఘవరెడ్డి పని చేయ గా.. ప్రస్తుతం మార్నేని రవీందర్‌రావు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల మార్నేని టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికవగా.. జంగా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితుల య్యారు. అయితే వీరిద్దరు రైతు భరోసా సదస్సులో పక్కపక్కనే కూర్చున్నా.. కాస్త ఎడమొహం.. పెడమొహంగానే ఉన్నారన్న చర్చ జరిగింది.

అర్హులెందరో?

5వ పేజీ తరువాయి

ఉంది. సోమవారం ఇచ్చిన విధివిధానాల మేరకు.. ప్రధానంగా 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు పంట రుణం తీసుకున్న రైతులకే రుణమాఫీ వర్తిస్తుంది. అలాగే 2023 డిసెంబరు 9వ తేదీ వరకు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలకు సంబంధించి అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు మాఫీ చేస్తారు.

దీనికి ఆహారభద్రత (రేషన్)కార్డును ప్రామాణికంగా తీసుకుని భూమి ఉన్న ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నారు. షెడ్యూల్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, ప్రాథమిక సహకార సంఘాల నుంచి తీసుకున్న పంట రుణాలకే మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. రీషెడ్యూల్ చేసిన రుణాలతో పాటు ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఎల్ఈసీఎస్ రుణాలకు మాఫీ వర్తించదని ప్రభుత్వం పేర్కొంది. అలాగే రుణమాఫీ అమలుకు ప్రతీ బ్యాంకులో నోడల్ అధికారిని నియమిస్తారు.

రుణమాఫీ ఎందరికంటే..?

వ్యవసాయంపైనే ఆధారపడిన రైతులు అత్యధికంగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో రుణమాఫీ రైతులకు ఉపశమనం కలిగించనుంది. అయితే ప్రభుత్వం తొలుత కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో లబ్ధిదారులుగా ఉన్న వారిని అర్హులుగా గుర్తించి వారికి తొలుత రుణమాఫీ చేయనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 3,81,890 మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. వీరికి మొదట రుణమాఫీ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తున్న ఈ పథకంలో కూడా కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పెట్టుబడి సాయాన్ని అందిస్తుంది. ఇందులో అర్హుల జాబితాను ప్రభుత్వం సేకరించి తొలి విడతలో నిబంధనల ప్రకారం అర్హులైన వారికి రూ.2లక్షల వరకు మాఫీ చేయనున్నారు. అలాగే రైతుబంధు పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులు లబ్ధిపొందుతున్నారు.

అయితే వీరిలో మాత్రం ఒక్క కుటుంబం నుంచి ఒక్కరి కంటే అధికంగా ఉన్నారు. దీంతో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవటంతో పాటు కటాఫ్ డేట్‌ను కూడా అమలు చేస్తే రూ.2లక్షల రుణమాఫీ వర్తించే అర్హుల జాబితా వచ్చే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 34 సహకార బ్యాంకుల్లో 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ కానుంది. ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5లక్షల నుంచి 6లక్షల మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వర్తించ వచ్చునని సమాచారం.

రేషన్‌కార్డు లింకుపై రైతుల్లో ఆందోళన..

ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలు రైతుల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా కుటుంబం మొత్తానికి రూ.2లక్షల వరకు మాఫీ ప్రకటించిన ప్రభుత్వం దీనికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. అయితే ఒక కుటుంబ నుంచి వేరు పడిన అనేక మంది రైతుల్లో ఇది ఆందోళన కలిగిస్తోంది. పదేళ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను జారీ చేయలేదు. వేర్వేరుగా ఉంటున్నా రేషన్‌కార్డు మాత్రం ఉమ్మడిగా ఉండటంతో ఈ రెండు లక్షల రుణమాఫీ ఎవరికి వర్తిస్తుందనే చర్చ జరుగుతోంది.

ఒక కుటుంబంలో ఇద్దరుముగ్గురు అన్నదమ్ముళ్లు ఉండి.. వారికి బ్యాంకుల్లో అప్పులు ఉంటే ఎవరివి మాఫీ అవుతాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కుటుంబ పెద్దకే రుణమాఫీ జరిగితే మిగతా సభ్యుల పరిస్థితేంటన్న చర్చ జరుగుతోంది. అలాగే చాలా మందికి రేషన్‌కార్డులు లేవు.

రేషన్‌కార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో తమ పరిస్థితేంటని మరి కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఐదారు ఎకరాల భూమి ఉంటే పింక్ కార్డులు ఇచ్చారు. వీటిపై రేషన్ కాకుండా కిరోసిన్ మాత్రమే ఇచ్చేవారు. కాలక్రమేణా ఆ కార్డులు కూడా ప్రస్తుతం లేవు. దీంతో వీరి పరిస్థితేంటని ఆవేదన చెందుతున్నారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన రైతు భరోసా సదస్సులో పలువురు రైతులు ఇదే అంశాన్ని మంత్రుల ఎదుట లేవనెత్తారు.

ఒక కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకోవద్దని, ఒక రైతును తీసుకోవాలని సూచించారు. పల్లెల్లో ఉమ్మడి కుటుంబాలు కలిసే ఉంటాయని, ఈ రుణమాఫీతో విబేధాలు వచ్చే అవకాశాలున్నాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. రేషన్‌కార్డును కాకుండా ఆధార్‌కార్డు ప్రామాణికంగా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతులు..

జిల్లా	రైతుబంధు రైతులు	పీఎంకేఎస్‌నిధి రైతులు
వరంగల్	1,54,822	65,361
హనుమకొండ	1,45,044	56,409
జనగామ	1,79,735	81,487
మహబూబాబాద్	2,14,685	90,978
భూపాలపల్లి	1,16,171	48,496
ములుగు	79,330	39,159
మొత్తం	8,89,787	3,81,890

విస్తారంగా వాన

- ఉమ్మడి జిల్లాలో పలు చెరువులకు జలకళ
- పలుచోట్ల ఉప్పొంగిన వాగులు



బయ్యారంలో అలుగు పారుతున్న కాకతీయుల నాటి పెద్ద చెరువు

హనుమకొండ / భూపాలపల్లి / జనగామ (ఆంధ్రజ్యోతి)/ బయ్యారం , జూలై 15 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో చెరువులు, వాగులు జలకళను సంతరించుకుంటున్నాయి. మెట్టపంటలు వేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా వాగులు ఉప్పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం హనుమకొండ జిల్లాలో సరాసరి 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా నడికూడ మండలం కంఠాత్మకూరు దగ్గర తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. ఇక్కడ వాగుపై వంతెనను నిర్మించే క్రమంలో ఈ తాత్కాలిక రోడ్డు వేయగా అది కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే వరంగల్, హనుమకొండ నగరాల్లోనూ వర్షం కారణంగా పలురోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దామెర మండలంలో అత్యధికంగా 51.7 మిమీ వాన పడింది. నడికూడ మండలం కంఠాత్మకూరు దగ్గర తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. భీమదేవరపల్లిలో 20.4మిమీ, వేలేరులో 9, ఎల్కతుర్తిలో 23.4, కమలాపూర్‌లో 36.7, హసన్‌పర్తిలో 43.7, ధర్మసాగర్‌లో 9.2, కాజీపేటలో 18.1మిమీ, హనుమకొండలో 29.6, పరకాలలో31.5, ఆత్మకూరులో30.3, శాయంపేటలో 31, నడికూడలో 23.8 మిమీ, ఐనవోలులో 2.3, వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహదేవపూర్, మల్హర్ మండలాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కాటారం మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు, పంటలు నీటమునిగాయి. ఓ ఇంటి ప్రహరీ నేలమట్టమైంది. వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్టు చెరువు కట్టపై నుంచి నీరు ప్రవహించగా కట్ట తెగిపోకుండా అధికారులు, రైతులు చర్యలు చేపట్టారు. రేగులగూడెం జీపీ పరిధిలోని గోపాల్‌పూర్ వద్ద వాగు పొంగి ఇటీవలే వేసిన వరినార్లు నీట మునిగాయి. జాదరావుపేట శివారులోని బ్రిడ్జి సమీపంలో వరద నీటితో తారురోడ్డు కోతకు గురై కుంగిపోవడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం మిడిచెరువు అలుగువాగు, వట్లోని వాగు పొంగిపొర్లడంతో ఆయా మార్గాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలోని పెద్ద వాగు ఉప్పొంగడంతో వందల ఎకరాల్లోని పత్తి చేలల్లో వరద నీరు నిలిచింది. మల్హర్ మండలంలోని కొండంపేట కుంబంమాటు వాగు అలుగు పడింది. మహదేవపూర్‌లోనూ పంటలు నీట మునగ్గా.. కొన్ని రోడ్లపై వాన నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మహదేవపూర్‌లో 109.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. పలిమెల మండలంలో 34.2, మహాముత్తారం 24.8, కాటారం 101.6, మల్హర్ 42.8, చిట్యాలలో 37.2, టేకుమట్లలో 85.8, మొగుళ్లపల్లిలో 28.6, రేగొండలో 7.4, గణపురంలో 6.2, భూపాలపల్లిలో 6.6 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. జనగామ జిల్లాలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. దేవరుప్పల మండలం కోలుకొండలో 39 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 30.3, పాలకుర్తి మండలం గూడూరులో 29, పాలకుర్తిలో 28.8, కొడకండ్లలో 17.8, జఫర్‌గడ్‌లో 16.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఏజెన్సీ జిల్లాలైన ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ విస్తృతంగా వానలు పడుతున్నాయి.

అలుగు పడిన బయ్యారం పెద్ద చెరువు

కాకతీయుల నాటి మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం పెద్ద చెరువు సోమవారం అలుగు పడింది. 16.03అడుగుల నీటి సామర్థ్యం గల ఈ చెరువులోకి 16.05 అడుగుల నీరు వచ్చి చేరడంతో సోమవారం ఉదయం నుంచి మత్తడి దుంకుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సాగు పనులను ముమ్మరం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోనే ప్రప్రథమంగా మత్తడి పారుతున్న బయ్యారం మండల కేంద్రంలోని పెద్ద చెరువును చూసేందుకు సమీప ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు.

మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

ఇదిలా ఉంటే రానున్న ఐదు రోజుల్లో హనుమకొండతో పాటు వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. జనగామ జిల్లాలోనూ మోస్తరు వానలు పడతాయని తెలపడంతో ఆయా జిల్లాల యంత్రాంగం అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలిచ్చింది.

19 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం

ఖానాపురం : జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు నీటి మట్టం సోమవారం నాటికి 19 అడుగులకు చేరుకుంది. పాకాల సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30 అడుగులు. గత యాసంగి పంటకు సాగి నీటి వినియోగం పూర్తయ్యేసరికి సరస్సులో 16 అడుగుల నీరు నిలువ ఉంది. కాగా ఈ వర్షాకాలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సులోకి కొత్తగా 3అడుగుల నీరు చేరడంతో సరస్సు నీటిమట్టం ప్రస్తుతం 19 అడుగులకు చేరుకుంది. దీంతో పాకాల ఆయకట్టులోని రైతులు వరిసాగు కోసం నార్లు పోస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



అలుగు పోస్తున్న భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని కుంబంమాటు



నడికూడ మండలం కంఠాత్మకూరు వాగు వద్ద తెగిపోయిన తాత్కాలిక బైపాస్ రోడ్డు

కుట్టుకూలి నిధులు విడుదల

లింగాలఘణపురం, జూలై15: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల యూనిఫాం కుట్టుకూళ్లు ఈ ఏడాది గతేడాదితో పోల్చుకుంటే ముందస్తుగా విడుదలయ్యాయి. గతంలో యూనిఫాం కుట్టిన మహిళా సంఘాలు, సంబంధిత ఏజెన్సీలు కుట్టుకూళ్ల డబ్బుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసేవారు. ఒక్కో జతకు గతంలో రూ. 50 చెల్లించిన ప్రభుత్వం ఈసారి కుట్టుకూళ్లను మరో 50శాతం పెంచి ఒక్కో జతకు రూ. 75 లెక్కన ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటి సారిగా విడుదలైన కుట్టుకూళ్లు మాత్రం జతకు రూ. 50 లెక్కన పాతపద్ధతిలోనే విడుదల చేయడం గమనార్హం. పెరిగిన అదనపు చెల్లింపులను రెండోదశ విడుదల చేయనున్నారు. అంతేకాకుండా మొదటి జత దుస్తులు అందించిన నెలరోజుల వ్యవధిలోనే కుట్టుకూళ్లను విడుదల చేయడం పట్ల మహిళా సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రెండో జత దుస్తులను కూడా ఈ నెలాఖరు కల్లా విద్యార్థులకు అందించే పనిలో అటు అధికారులు, ఇటు కుట్టు కేంద్రాలకు చెందిన మహిళా సంఘాలు సన్నద్ధమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 3,195 పాఠశాలలకు చెందిన 1,66,795 మంది విద్యార్థులకు సంబంధించిన రూ.83,39,750 లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

జిల్లాల వారీగా నిధుల మంజూరు వివరాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	రూ.లు
జనగామ	484	28116	14,05,800
మహబూబాద్	852	39781	19,89,050
జయశంకర్	416	19129	9,56,450
ములుగు	414	17845	8,92,850
హన్మకొండ	474	29623	14,81,150
వరంగల్	555	32301	16,15,050
మొత్తం	3195	1,66,795	83,39,750

పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల రాస్తారోకో

నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



కేసముద్రం పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన మృతుడి బంధువులు

కేసముద్రం, జూలై 15 : కేసముద్రం విలేజిలో ఆదివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన జిలుకర నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు మాట్లాడుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్న నాగరాజును హత్య చేశారని ఆరోపించారు. నిరుపేద అయిన నాగరాజు తల్లిదండ్రులను ఆదుకోవాలని కోరారు. నాగరాజు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రాకముందే పోస్టుమార్టంకు తరలించారని ఆరోపిస్తూ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు అర్ధగంటకుపైగా వరంగల్-మహబూబాబాద్ రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య రాస్తారోకో జరుగుతున్న ప్రాంతానికి చేరుకొని నాగరాజు మృతికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఇదిలా ఉండగా రాస్తారోకో నిర్వహిస్తున్న సమయంలో ఉద్రిక్త పరిస్థితులుండడం తో ముందుజాగ్రత్తగా పోలీసులు అప్రమత్తమై అదనంగా గూడూరు సీఐ బాబురావు, కేసముద్రం, కురవి, కొత్తగూడ, గూడూరు ఎస్ఐలు వంశీధర్, గోపి, దిలీప్, నగేష్‌తోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు తరలివచ్చి మోహరించారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ

కేసముద్రం, జూలై 15 : మండలంలోని కల్వల ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులకు రూ.40వేల విలువైన టీషర్టులు, ఐడీ కార్డులు, టై, బెల్టులను హెచ్‌ఎం కళ్లెం వీరారెడ్డి తన సొంత డబ్బులతో అందజేశారు. ఆ పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ పీజీహెచ్‌ఎం బండారు నరేందర్ చేతుల మీదుగా విద్యార్థులకు టీషర్టులను పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం భారీ విరాళంతో టీషర్టులను సమకూర్చడం అభినందనీయమని పీజీహెచ్‌ఎం అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఎం.మౌనిక, గనె యాదగిరి, డి.గోపి, వి.సుమలత, స్వరూప, హరికృష్ణ, జి.కృష్ణ, శ్రీదేవి, మోహనకృష్ణ పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు పింఛన్లు ఇవ్వాలి

కేసముద్రం, జూలై 15: ఒంటరి మహిళలకు నూతనంగా ఆసరా పింఛన్ల జారీ గత మూడేళ్లుగా నిలిచిపోయిందని, వీటిని వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. కేసముద్రం స్టేషన్ కట్టుకాల్వలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని నెలల తరబడి ఎదురుచూస్తున్నారని, వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో లావుడ్యా శారద, భూక్య రుక్మిణి, జాటోత్ కవిత, మంద మమత, ఓర్సు సోమలక్ష్మి, ఉపేంద్ర పాల్గొన్నారు.

కబడ్డీలో డోర్నకల్ యువకుడి ప్రతిభ

డోర్నకల్, జూలై 15 : డోర్నకల్ మండలం చాంప్లాతండాకు చెందిన దారావత్ మల్హార్ అనే యువకుడు కబడ్డీలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికై ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈనెల 13, 14, 15 తేదీల్లో గోవాలో నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి పాల్గొన్నారు. ప్రస్తుతం మల్హార్ ఖమ్మంలోని ఓ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కబడ్డీలో మల్హార్ రాష్ట్రజట్టుకు ఎంపికై ప్రాతినిధ్యం వహించడం పట్ల మండల, చాంప్లాతండవాసులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

నెల్లికుదురు, జూలై 15 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపెల్లి వీరన్న డిమాండ్ చేశారు. నెల్లికుదురులో సోమవారం సంబంధిత కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీల అమలుకై ఈనెల 22న మండల కేంద్రాల్లో, 29న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అనిల్, మల్లయ్య, వెంకన్న,రాములు, సైదులు, వెంకటయ్య పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

▸▸ కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన

మహబూబాబాద్ టౌన్, జూలై 15 : తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల సాధన కోసం రాష్ట్రంలోని అత్యధిక పెన్షనర్ల సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి తెలంగాణ ప్రభుత్వపెన్షనర్ల జేఏసీని ఏర్పాటు చేసి పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 2.80లక్షల మంది పెన్షనర్లపై వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం మంజూరి చేసిన ఐఆర్ 5 శాతాన్ని 20కు పెంచాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వెంకటయ్య, మల్లయ్య, రాములు, ఎ.వెంకటేశ్వర్లు, సురేందర్, పాపయ్య, ఆరెంపుల వెంకటయ్య, రంగాచారి, కె.వెంకన్న పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 15 : కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ శంకర్‌నాయక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం మార్బుల్ అండ్ టైల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి సౌకర్యాలు కార్మికులకు అందడం లేదన్నారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్డీ.అంజద్, అధ్యక్షుడిగా బాబురావు, ఉపాధ్యక్షుడిగా ఎమ్డీ.పాషా, కార్యదర్శిగా ఎమ్డీ.షబ్బీర్, సహాయ కార్యదర్శిగా వెంకన్న, కోశాధికారిగా రమేష్‌ను ఎన్నుకున్నారు.

చీకటిమయంగా సెంట్రల్ లైటింగ్ రోడ్లు : సీపీఐ

మహబూబాబాద్ టౌన్, జూలై 15 : నాణ్యతా లోపంతో ఉన్న ఎల్‌ఈడీలతో సెంట్రల్ లైటింగ్ రోడ్లు చీకటిమయంగా మారుతున్నాయని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారథిరెడ్డి ఆరోపించారు. మహబూబాబాద్‌లో ఆదివారం సెంట్రల్ డివైడర్ల వద్ద ఎల్‌ఈడీ లైట్లు వెలగని ప్రాంతాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ నుంచి మూడు కొట్ల జంక్షన్ వరకు, అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వరకు, మూడు కొట్ల జంక్షన్ నుంచి ముడుపుగల్ రోడ్డు వరకు, పలు వీధుల్లో సైతం వీధి లైట్లు వెలగక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతా లోపం, నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న ఎల్‌ఈడీ కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. చింతకుంట్ల వెంకన్న, మంద శంకర్, నక్క నాగార్జున, తండా శ్రీనాథ్ పాల్గొన్నారు.

రైతు భరోసాపై మనోగతం వెల్లడించిన జిల్లా రైతులు

▸▸ హాజరైన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



హనుమకొండ కలెక్టరేట్‌లో రైతు భరోసా పథకం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మానుకోట జిల్లా రైతులు

మహబూబాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో రైతు భరోసా పథకంపై సోమవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో మానుకోట జిల్లాకు చెందిన రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, సీతక్క ఉమ్మడివరంగల్ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో రైతు భరోసా పథకంపై సమావేశమయ్యారు. ఇందులో మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన రైతు మేక వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో భాగంగా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం కల్పించాలని కోరారు. డోర్నకల్‌కు చెందిన రైతు రాంరెడ్డి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. బోగస్ పట్టేదార్ పాస్‌పుస్తకాలను ఏరివేసినూతనంగా పారదర్శకగా పట్టేదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేయాలన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి రైతు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... రైతు భరోసా పథకం వ్యవసాయ కుటుంబాలన్నీటికి వర్తింపజేయాలనిఅభిప్రాయాన్ని వెల్లడించారు.

రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

▸▸ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



దంతాలపల్లిలోని హోటల్‌లో చాయ్ తాగుతున్న మంత్రి పొంగులేటి

దంతాలపల్లి, జూలై 15: రైతన్న సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న దంతాలపల్లి జాతీయ రహదారిపై కొద్దిసేపు ఆగి దంతాలపల్లి మండల కార్యకర్తలతో సరదాగా ముచ్చటించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. పదవుల కోసం పాకులాడితే నిరాశయే మిగులుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్, నాయకురాలు గిర్వాణి, నాయకులు కొమ్మినేని సతీష్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్వీవి నిరాధారమైన ఆరోపణలు

మరిపెడ, జూలై 15: మరిపెడ సీతారాంపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంపై టీఆర్‌ఎస్వీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి దీపక్ నిరాధారమైన ఆరోపణలు చేశారని ఆ స్కూల్ కాంప్లెక్స్ పరిధి టీచర్లు సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. వెంటనే దీపక్ హెచ్‌ఎంకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేసి పబ్బంగడుపుకోవాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో అర్జున్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్

▸▸ జాతీయ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ వెంకటనారాయణ

ఇనుగుర్తి, జూలై 15 : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జాతీయ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ కన్న వెంకటనారాయణ అన్నారు. సోమవారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వేసవికాల వాలీబాల్ శిక్షణ కార్యక్రమాన్ని ముగించుకున్న క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. వాలీబాల్ క్రీడలో రాణించి ఇనుగుర్తికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు బొబ్బిలి మల్లారెడ్డి, నల్ల భిక్షపతి, కన్న సాంబయ్య, వద్దిరాజు దేవేందర్, నాగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు జెర్సీలను అందించిన వెంకటనారాయణ

సమయం పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 15 : సమయపాలన పాటించని ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలుతీసుకోవాలని లంబాడా హక్కుల పోరాట సంఘం(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమా నాయక్ అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట సోమవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ.. సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సామాన్య ప్రజలు తమగోడు చెప్పుకోవడానికి కార్యాలయాలకు వస్తే 11గంటల తర్వాతనే అధికారులు చేరుకుంటున్నారని చెప్పారు. తద్వారా ప్రజలుఇబ్బందులు పడుతున్నారని, అధికారులు, ఉద్యోగులు సమయానికి విధులకు వచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బానోత్ విష్ణు, శ్రీనివాస్‌నాయక్, రాందాస్, శివవర్మ, శ్రీను, చంద్రశేఖర్, మంగీలాల్, ప్రవీణ్, బాలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు

నెహ్రూసెంటర్, జూలై 15 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి ఆస్పత్రి పరిసరాలు, ల్యాబ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సురక్ష ఆస్పత్రి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ గడువు ముగిసిందని, వాటిని రెన్యువల్ చేయించనందుకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. డాక్టర్ వీరూస్, ఏవీల డయాగ్నస్టిక్, ధరణి ఆస్పత్రిని తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం వారికి సైతం నోటీసులు ఇచ్చి మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష, కొప్పు ప్రసాద్, కృష్ణార్జున్‌రావు, మంగమ్మ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లోని సురక్ష ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

సీతారామ ప్రాజెక్టు నీటిని ఏజెన్సీకి తరలించాలి : ఎన్డీ



బయ్యారంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

బయ్యారం, జూలై 15: సీతారామ ప్రాజెక్టు నీటిని మొదటి ప్రాధాన్యతగా ఏజెన్సీ మండలాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మోకాళ్ల మురళీక్రిష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు నీటిని ఏజెన్సీ మండలాలకు సాధించుకునేందుకై ఉద్యమించాలని కోరుతూ బయ్యారంలో సోమవారం ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మురళీక్రిష్ణ మాట్లాడుతూ బయ్యారం, రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గత సీఎం కేసీఆర్ శిలాఫలకం వేసి హామీ ఇచ్చినప్రకారం రోళ్లపాడు రిజర్వాయర్ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, డోర్నకల్, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల ఏజెన్సీ మండలాలన్నింటికి మొట్ట మొదటగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును విస్మరించిందని విమర్శించారు. డిజైన్ మార్చివేయడం, డీపీఆర్‌లో ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్, బయ్యారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను విస్మరించి నాగార్జునసాగర్ పాత ఆయకట్టు స్థిరీకరణ కోసమే సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ మండలాలకు జరుగుతున్న అన్యాయం పట్ల ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు చోద్యం చూశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లోఇచ్చిన హామీ మేరకు సీతారామ ప్రాజెక్టు జలాలను మొదటి ప్రాధాన్యతగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంగా జరిగే సదస్సులో రైతులందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు నాగేశ్వరావు, రాకేష్, యుగేందర్, రమేష్, ఐలయ్య, మహేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

గూడూరు, జూలై 15 : పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. గూడూరు మండలం చిన్న ఎల్లాపురం, చిర్రకుంట తండాలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నఎల్లాపురంలో 25మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఇద్దరి రక్త నమూనాలు సేకరించారు. చిర్రకుంటలో 32మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ముగ్గురు జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు ఆమె తెలిపారు. అనంతరం రోగులకు మందులందజేశారు. కార్యక్రమంలో వైద్యులు దేవేందర్, శ్రీమన్నారాయణ, హెచ్‌ఈవో లోక్యనాయక్, కోమల, విశాల, హేమలత, సర్దార్‌బాబు, లాలు, నరేందర్‌రెడ్డి, రఘు, రజిత, స్రవంతి, శ్రీలత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సింహులపేట, జూలై 15: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో సోంలాల్ అన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు జయపురం, రామన్నగూడెం, ముంగిమడుగు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి పారిశుధ్యపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వర్షాకాలంలో వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకై వీధుల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ ముందంజ

డోర్నకల్, జూలై 15 : సమాజంలో లయన్స్‌క్లబ్ సేవలు చాలా విస్తృతమైనవని, అన్ని సమయాల్లో లయన్స్‌క్లబ్ పేదలకు సాయం అందించడంలో ముందంజలో ఉంటుందని క్లబ్ పూర్వ గవర్నర్ ఎన్.వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి డోర్నకల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డోర్నకల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... గతంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక కార్యక్రమాలను వివరించారు. సమాజంలోని అన్ని వర్గాల సామాజిక అభివృద్ధి కోసం లయన్స్‌క్లబ్ తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అడిషనల్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, రీజినల్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి, జోనల్ చైర్మన్ రవిచందర్‌రెడ్డి, అతిథులు పరకాల శ్రీనివాస్‌రెడ్డి, కొండపల్లి కేశవరావు, లయన్స్‌క్లబ్ ఆఫ్ డోర్నకల్ వ్యవస్థాపక అధ్యక్షులు వక్కంతుల అప్పారావు, విత్తనాల సుధాకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ డోర్నకల్ నూతన అధ్యక్షుడిగా మధు, ట్రెజరర్‌గా నరేష్, కార్యదర్శిగా యశోదర్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా నలబోలు శ్రీనివాస్, కనకరాజ్, గుట్టుజైన్, యుగందర్, పాటి రమేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 89.4 మి.మీ వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 15 : జిల్లాలోని కొత్తగూడలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురియగా పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు పడ్డాయి. కొత్తగూడ మండలంలో 61.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, గంగారంలో 10.2, గూడూరులో 6.8, మరిపెడలో 1.4, దంతాలపల్లిలో 2.0, తొర్రూరులో 2.6, పెద్దవంగరలో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో వర్షం పడలేదు. జిల్లాలో వెరసి 89.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 5.6 మిల్లీమీటర్లుగా నమోదైంది.

నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 15 : మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) స్వయంప్రతి హోదా కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజు సోమవారం తెలిపారు. 2022 నవంబరులో న్యాక్ అక్రిడియేషన్ కోసంవెళ్లగా 2.98 పాయింట్స్ పొంది బి++ గ్రేడ్ సాధించిన కళాశాలకు ఈనెల 15న స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ యూజీసీ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. 2024-25 నుంచి 2028-29 వరకు ఈ హోదా కొనసాగుతుందని తెలిపారు. దీని వల్ల కళాశాల అభివృద్ధికి నిధులు రావడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. స్వయం ప్రతిపత్తి హోదా రావడం పట్ల కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 15 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు పాఠశాలలు, ఇళ్లలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భూక్య సరినాయక్, ఉపాధ్యాయ బృందం వాసుదేవ్, షరిరామ్, భరత్‌వ్యాస్, మాధవి, ప్రతిభ, లత, రామ్మోహన్‌రావు, అశోక్‌రెడ్డి, కల్యాణి, శోభా, జబర్‌లాల్, పద్మావతి, మునిసిపల్ సిబ్బంది శ్రీకాంత్, అరవింద్ పాల్గొన్నారు.

● కురవి : మొక్కలు నాటడంతోనే పర్యావరణం పరిరక్షించబడి వర్షాలు సకాలంలో కురుస్తున్నాయని హెచ్‌ఎం దారావత్ వెంకన్న అన్నారు. కురవి మండలం సూదనపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వనమహోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్, ఎండి.అంజాద్‌పాషా, జి.బాలరాజు, కె.సారంగం, వి.శుభ, బి.సరోజ, ఎ.ప్రగతి పాల్గొన్నారు.

ప్రారంభమైన అమ్మ మాట-అంగన్‌వాడీ బాట

మహబూబాబాద్ టౌన్, జూలై 15: రెండున్నరేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' మానుకోటలో సోమవారం ప్రారంభమైంది. మునిసిపల్ పరిధిలోని అద్దాలతండాలో జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 20 వరకు అమ్మ మాట-అంగన్‌వాడీ బాట నిర్వహించి రెండున్నర ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రం ప్రీ స్కూల్‌లో చేర్పించనున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు సహకరించి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నర్సింహులపేట, జూలై 15 : పాఠశాలలోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో గుగులోతు రాము అన్నారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు గణితం, సామాన్యశాస్త్రాల బోధన సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో స్వప్న, సీఆర్పీ శేషు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కబేళా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 15 : గోవధ, పశువుల అక్రమ రవాణాపై నిషేధ చట్టాలు ఉన్నప్పటికి అధికారుల అండదండలతో పట్టణంలో రహదారుల వెంట తిరిగే ఆవులను అక్రమంగా తరలించుకుపోతున్న కబేలా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మానుకోట హిందూ సమాజ్ నాయకురాలు దారా ఇందుభారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ కలెక్టరేట్, మునిసిపల్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఇందుభారతి మాట్లాడుతూ పట్టణంలో తిరిగే ఆవులను కబేలాలకు తరలించడం దర్మార్గమన్నారు. రాత్రి వేళల్లో ఆవులను తరలించుకుపోతుంటే అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. మురళి, సాయి, ప్రశాంత్, భద్రి, ప్రేమ్‌సాగర్, వినయ్, శ్రీను, భారత్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం

▸▸ సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

తొర్రూరు, జూలై 15 : ప్రజా సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులతోనే సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే అని, కమ్యూనిస్టు పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు ప్రజల పక్షాన పోరాడుతాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు వస్తాయని ప్రగల్భాలు పలికిందని, రాజ్యాంగాన్ని మారుస్తామనుకున్నారని కానీ ప్రజలు చైతన్యవంతులై బీజేపీ విధానాలపై వ్యతిరేకించారన్నారు. వారి ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయిలో పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్రంలో రాజకీయాలు సమర్థవంతంగా లేవని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు టి. విశ్వేశ్వర రావు, నాయకులు బందు మహేందర్, ఓమ భిక్షపతి, కిరణ్, లక్ష్మణ్, ఎల్లయ్య, యాకాంతం, శ్యాం సుందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 15: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, అశ్విని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా వైద్యాధికారి కళావతిభాయికి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 16 ప్రకారం సెకండ్ ఏఎన్‌ఎంలను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. గత 17 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో సైతం ప్రాణాలను లెక్క చేయకుండా వైద్య సేవలందించిన సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సుమ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూసెంటర్, జూలై 15 : గిరిజన సంక్షేమ శాఖలో కొంతమంది కిందిస్థాయి అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో చిత్ర మిశ్రాను కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసునాయక్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖలోని సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు. కొంతమంది అధికారుల అవినీతి, అక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో బోడ రమేష్‌నాయక్, హత్తిరాంనాయక్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దండోరా సదస్సును జయప్రదం చేయాలి

నెహ్రూసెంటర్, జూలై 15 : మాదిగల హక్కులు, వారి ఆత్మగౌరవం కోసం ఈనెల 19న యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం కాలనీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులను మోసం చేస్తూనే ఉందన్నారు. మాదిగలువారి ఆత్మగౌరవ హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కాకతప్పదన్నారు. 19న జరిగే రాష్ట్ర స్థాయి సదస్సుకు తెలంగాణలోని అన్ని జిల్లాల కార్యకర్తలు సైనికుల్లా కదలిరావాలని కోరారు. సమావేశంలో దేవి, ఉపేందర్, గుంజె బాబు, సీహెచ్.రాధ, కుక్కల సుధ, సందీప్, బాలకృష్ణ, కందుకూరి వీరన్న, సమ్మయ్య, గుళ్ల పద్మ, సాంబయ్య, సంధ్య, సమ్మక్క పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు ఘన సన్మానం



బయ్యారంలో ఉపాధ్యాయినులను సన్మానించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

బయ్యారం, జూలై 15 : ఇటీవల పదోన్నతి, బదిలీపై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయినులను బయ్యారంలో సోమవారం పూర్వ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేసిన కవిత, వసంత, పద్మలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పదోన్నతి, బదిలీపై పాఠశాలను విడిచి వెళ్లారు. కవిత ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా, వసంత మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందగా, పద్మ లాంగ్ స్టాండింగ్‌తో బదిలీ అయ్యారు. దీంతో ఆయా ఉపాధ్యాయినులను పూర్వపాఠశాల నందు సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేంద్రాచారి, బయ్యారం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణరావు, సీపీఎస్ హెచ్‌ఎం బాలు నాయక్, ఉపాధ్యాయులు భద్రు, రూప్లా, రంగన్న, సంధ్యారాణి, ఏపీపీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఐక్యత కోసం భారీగా తరలిరావాలి

దంతాలపల్లి, జూలై 15: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చిల్లా సహదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి దుండి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కన్వీనర్ పంజా వెంకన్న, మండల అధ్యక్షుడు గోనెల ఎల్లయ్య, ప్రధానకార్యదర్శి సాధు రాములు, నాయకులు చిల్లా రామకృష్ణ, పంజా నరేష్, నల్లల వెంకన్న, దుండి సైదులు, పాక ధర్మయ్య, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.